# అక్షరాంజలి

పద్మ

# ది గ్రేప్స్ ఆఫ్ రాత్

## -జాన్ స్టెయిన్‌బెక్

సామాన్యుల జీవితాలను అసామాన్య రీతిలో సాహిత్య రంగస్థలంపై ప్రదర్శించిన రచయిత అతడు. అతడి నవలలను, అమెరికా దేశ చరిత్రలో, ఇరవయ్యవ శతాబ్దంలోని అతిక్లిష్టమైన దశను అత్యద్భుతంగా ప్రతిబింబించిన రచనలుగా ప్రపంచం గుర్తించింది. సత్కరించింది. అమెరికన్లు 'కమ్యూనిస్టు' అని అతడిని దూషించారు. కమ్యూనిస్టులు అతడిని 'కమ్యూనిజం తెలియని మూర్ఖుడు' అని విమర్శించారు. ఎవరెలా విమర్శించినా, ఎవరెంతగా పొగిడినా తనదైన రీతిలో తన మనసుకు నచ్చిన విధంగా రచనలు చేస్తూ అలానే జీవించిన అద్భుతమైన రచయిత, వ్యక్తి. నోబెల్ బహుమతి గ్రహీత జాన్‌స్టెయిన్ బెక్. అతని రచనలన్నీ ఆణిముత్యాలే అయినా వాటిల్లో మేలిముత్యం లాంటి రచన 'ది గ్రేప్స్ ఆఫ్ రాత్'.

1902, ఫిబ్రవరి 27న కాలిఫోర్నియాలోని 'సాలినాస్ లోయ' ప్రాంతంలో జన్మించాడు జాన్ ఎర్నెస్ట్ స్టెయిన్‌బెక్. ఆరంభం నుంచీ స్టెయిన్‌బెక్‌కు చదువంటే శ్రద్ధ లేదు. ఊహ తెలిసినప్పటి నుంచీ రచయితగా స్థిరపడాలన్నదే అతని ఆలోచన. దాంతో పొట్టకూటి కోసం అనేక చిన్న చిన్న ఉద్యోగాలు చేశాడు కానీ ఏ ఉద్యోగంలోనూ స్థిరపడాలని ప్రయత్నించలేదు. ఇళ్ల నిర్మాణాల్లో రాత్రి కూలీగా పనిచేశాడు. అలా పనిచేస్తూ మొదటి నవల 'కప్ ఆఫ్ గోల్డ్'ను పూర్తి చేశాడు. 1929లో నవల ప్రచురితమయింది. కానీ ఆ నవలను ఎవరూ పట్టించుకోలేదు. అయినా నిరుత్సాహపడకుండా రచనలు చేస్తూ పోయాడు. 'టు ఎ గాడ్ అన్‌నోన్' ఎవరికీ అర్థం కాలేదు. 'అది ఎవరికీ అర్థం కాదని తెలిసే రాశాను' అంటాడు స్టెయిన్‌బెక్. ఈ సమయంలో అతని దృష్టి 'మెరైన్ బయాలజీ' వైపు మళ్లింది. సముద్ర జీవులను పరిశోధించటం హాబీగా మారింది.

1935 నుంచి అమెరికన్ల ఆర్థిక పరిస్థితి దిగజారటం ఆరంభమయింది. ఈ పరిస్థితిని వర్ణిస్తూ హాస్యంగా, వ్యంగ్యంగా రాసిన 'టోర్టిల్లా ఫ్లాట్' అనూహ్యమైన రీతిలో పాఠకాదరణ పొందింది. ఆ నవలను సినిమాగా కూడా మలచటంతో ఆర్థికంగా స్టెయిన్‌బెక్ నిలదొక్కుకోగలిగాడు. అతడి పేరు పదిమందికి తెలిసింది. దాంతో వార్తాపత్రికలలో వ్యాసాలు రాయటం ఆరంభించాడు. 1936లో రచించిన 'ఇన్‌డుబియస్ బాటిల్' అనే నవలలో వలసకూలీల గురించి అద్భుతంగా వర్ణించాడు స్టెయిన్‌బెక్. ఆ నవలతో స్టెయిన్‌బెక్‌కు కమ్యూనిస్టన్న ముద్ర పడింది. 1937లో రచించిన 'ది రెడ్ పోనీ', స్టెయిన్‌బెక్ విమర్శకులను సైతం ముగ్ధులను చేసింది. కరగిన కలలను ప్రతిబింబించే 'ఆఫ్ మైస్ అండ్ మెన్', లెన్నీ, జార్జ్ అనే మరపురాని పాత్రలను ఆంగ్ల సాహిత్యానికి అందించింది. ఆ నవలతో స్టెయిన్‌బెక్ అమెరికాలో నెంబర్ వన్ రచయిత స్థానాన్ని ఆక్రమించాడు.

కాలిఫోర్నియాలో వలస వచ్చిన వారి కోసం ఏర్పరచిన క్యాంపులలోని పరిస్థితులను పరిశోధించేందుకు ఓ పత్రిక జాన్ స్టెయిన్‌బెక్‌ను పంపింది. అక్కడ అతి దుర్భర పరిస్థితులలో జీవితం గడుపుతున్న వలస వచ్చిన వారిని చూసి స్టెయిన్‌బెక్ హృదయం ద్రవించింది. ఫలితంగా 'ది గ్రేప్స్ ఆఫ్ రాత్' నవల రూపుదిద్దుకుంది.

'గ్రేప్స్ ఆఫ్ రాత్' నవల ప్రచురితమవుతూనే సంచలనం సృష్టించింది. ఆ నవలలో వర్ణించినంత దుర్భర పరిస్థితులు అమెరికాలో లేవని, స్టెయిన్‌బెక్ రాసినవన్నీ అబద్ధాలని రాజకీయ నాయకులు స్టెయిన్‌బెక్‌పై దుమ్మెత్తిపోశారు. ఈ నవలను తమ ప్రజలకు చూపి అమెరికాలో పరిస్థితులెంత దారుణంగా ఉన్నాయో రష్యా ప్రచారం చేయటంతో స్టెయిన్‌బెక్‌పై కమ్యూనిస్టు ముద్ర మరింత గాఢంగా పడింది.

అయితే 1942లో నార్వేజియాపై దురాక్రమణను ప్రతీకాత్మకంగా ప్రదర్శించే 'ది మూన్ ఈజ్ డౌన్' నవల సంచలనం సృష్టించింది. ఈనాటికీ ఈ నవల దురాక్రమణదారుల భుజాలు తడుముకునేట్టు చేస్తుంది. 'ఈస్ట్ ఆఫ్ ఈడెన్', 'ది వింటర్ ఆఫ్ అవర్ డిస్‌కంటెంట్' వంటి నవలలు స్టెయిన్‌బెక్ రచనా సామర్థ్యానికి దర్పణం పట్టే నవలలు. మానవ జీవితాన్ని ఉన్నదున్నట్టు చిత్రిస్తూ, నిత్యజీవితంలోని వైరుధ్యాన్ని ప్రతిబింబించే రచనలు చేస్తున్నందుకు 1962లో స్టెయిన్‌బెక్‌కు నోబెల్ సాహిత్య పురస్కారం లభించింది. 1968, డిసెంబర్ 20న స్టెయిన్‌బెక్ మరణించాడు.

'గ్రేప్స్ ఆఫ్ రాత్' నవల పేరులోనే మతపరమైన గూఢార్థం ఉంది. బైబిల్‌లోని 'రివిలేషన్' అధ్యాయంలోని ప్రతీకలను కలిపి నవలలో సమర్థవంతంగా వాడుకున్నాడు స్టెయిన్‌బెక్. 'రాత్' అంటే కోపం. ఎంత కోపం అంటే వ్యక్తికి హాని చేసేంత కోపం. 'గ్రేప్స్' అంటే ద్రాక్ష పళ్లు అన్నది సామాన్యార్థం. బైబిల్‌లోని 'సాంగ్ ఆఫ్ సాంగ్స్'లో వక్షోజాలను ద్రాక్షగుత్తులతో పోలుస్తారు. మానవ శరీరాన్ని అర్పణం చేస్తారు. ఈ రెండు అర్థాలను కలిపి నవల పేరు 'గ్రేప్స్ ఆఫ్ రాత్' అని పెట్టాడు స్టెయిన్‌బెక్. అంటే 'భగవంతుడి కోప ఫలితం' అన్నమాట. నవల పూర్తయ్యేసరికి, ముఖ్యంగా చివరి సంఘటన నవల పేరులోని పరమార్థాన్ని స్పష్టం చేస్తుంది.

అమెరికాలో 'డిప్రెషన్' సమయం అది. ధనవంతులు మరింత ధనవంతులై, పేదవారు మరింత పేదవారవుతున్న సమయం అది. ఎటు చూసినా కరవు పరిస్థితులు నెలకొన్న సమయం అది. బ్యాంకులు, కంపెనీలు రైతుల రక్తాన్ని పీల్చి, వారి భూముల నుంచే వారిని వెడలనడుపుతున్న సమయం అది. పొట్టచేత పట్టుకుని తమ భూములు వదిలి రైతులు ఏదో ఉద్యోగం దొరుకుతుందన్న ఆశతో పట్టణాలు వలస వస్తున్న సమయం అది. ఆ సమయంలో 'టామ్ జోడ్' అనే యువకుడు జైలు నుంచి ఇంటికి తిరిగి వస్తుంటాడు. ఆత్మరక్షణలో ఓ వ్యక్తిని హత్య చేసిన నేరానికి జైలుశిక్ష అనుభవిస్తాడు 'టామ్ జోడ్'. 'టామ్' ఇంటికి వస్తూండటంతో నవల ఆరంభమవుతుంది.

ఇక్కడే మనం స్టెయిన్‌బెక్ శైలి గురించి ఓ విషయం చెప్పుకోవాలి. అందరూ అవే పదాలను వాడినా కొందరు రచయితల రచనలో సామాన్య పదాలకు ఓ రకమైన శక్తి వస్తుంది. ఇతర రచయితల పదాలు అర్థాన్ని సృష్టిస్తాయి. భావాన్ని కల్పిస్తాయి. కానీ కొందరు రచయితల పదాలు కళ్ల ముందు దృశ్యాలను సృష్టిస్తాయి. మనసులో ఆ దృశ్యాలను ప్రత్యక్షంగా చూస్తున్న అనుభూతినిస్తాయి. ఎందుకో తెలియదు కానీ ఆ రచయితల రచనలు చదువుతూంటే మధురంగా అనిపిస్తుంది. స్టెయిన్‌బెక్ అటువంటి రచయిత. అతని వర్ణనలు నదీప్రవాహాన్ని గుర్తుకు తెస్తాయి. స్వచ్ఛమైన నీటి అడుగున తెల్లగా శుభ్రంగా కనిపిస్తూ, దొర్లిపోయే గులకరాళ్ల గతిని తలపునకు తెస్తాయి.

'గ్రేప్స్ ఆఫ్ రాత్' నవల ఆరంభంలో 'రెడ్ పోనీ కంట్రీ'లోని కరవు పరిస్థితి వర్ణిస్తాడు రచయిత. వర్షాలు పడక, ఎర్రని ఎండ కాస్తూంటే, పండిన పంటలు మాడిపోయి దాదాపుగా ఎడారిలా నిర్జీవంగా అయిపోయిన నేలను వర్ణిస్తాడు. వేడిగాలికి దుమ్ము ధూళి లేచి ఎగరటాన్ని వర్ణిస్తాడు. ఈ వర్ణన చదువుతూంటే కళ్ల ముందు ఎర్రటి బంజరు భూమి నిలుస్తుంది. దుమ్ము ధూళితో కూడిన ఈదురుగాలి అనుభవానికి వస్తుంది. ఆ దుమ్ము ధూళితో ముక్కుపుటాలు అదురుతాయి. గొంతుకేదో అడ్డుపడుతుంది. ఈ వర్ణన చదువుతూంటే నిజంగా 'రెడ్

మీకు నచ్చిన మంచి నవలల గురించి మీరూ ఈ పేజీల్లో రాయవచ్చు. ఇలాగే మొత్తం నవలని పరిచయం చేయగలిగితే నాలుగు అరఠావులు మించకుండా పేజీకి ఒకవైపే రాసి పంపండి. అమ్మో, అంత రాయలేం అనిపిస్తే మీకు నచ్చిన పుస్తకం గురించి ఒక అరఠావు పేజీ రాసి పంపించండి. చిరునామా తెలుసుగా. కవరుమీద 'అక్షరాంజలి' అని రాయడం మరిచిపోకండి.

పోనీ కంట్రీ'లో నిలబడి ఆ దృశ్యాన్ని చూస్తున్న అనుభూతి కలుగుతుంది. అక్షరాలు ఆప్యాయంగా మనసులో చేరి జీవిత కథను వినిపిస్తున్న భావన కలుగుతుంది.

ఇంటికి వస్తున్న టామ్ జోడ్‌కి, కరవు పరిస్థితి వల్ల తన కుటుంబం పట్టణానికి తరలివెళ్తోందని తెలుస్తుంది. కంపెనీ వారు, బ్యాంకు వారు కలిసి రైతులను తరిమివేస్తున్నారని తెలుస్తుంది. కాలిఫోర్నియాలో బోలెడన్ని ఉద్యోగాలున్నాయన్న కరపత్రం చదివి జోడ్ కుటుంబం కాలిఫోర్నియా ప్రయాణమవుతుంది. తాతయ్య, నాయనమ్మ, అంకుల్ జాన్, అమ్మ, నాన్న, వాళ్ల సంతానం నోవా, అల్, గర్భవతి అయిన రోజ్ ఆఫ్ షరన్, ఆమె భర్త కానీ, ఇంకా రూథీ, విన్‌ఫీల్డ్ అనే పిల్లలు... వీళ్లంతా 'జోడ్' కుటుంబ సభ్యులు. తాము కాలిఫోర్నియా వెళ్లిపోతే జైలు నుంచి తిరిగి వచ్చిన టామ్‌ను కలిసే వీలుండదని అమ్మ భయపడుతూంటుంది. అందుకే టామ్ కనబడగానే, ఆమె ఎంతో సంతోషిస్తుంది. భగవంతుడు తన మొర ఆలకించాడని భావిస్తుంది. టామ్‌కు దారిలో జిమ్ కేసీ అనే క్రిస్టియన్ మత ప్రచారకుడు పరిచయం అవుతాడు. నిజానికి జిమ్ ఇప్పుడు మత ప్రచారం మానేస్తాడు. ఎందుకంటే బైబిల్‌లో ఉన్నట్టు పవిత్రాత్మ దేవుడో, జీససో కాదని అది మానవుడి ఇచ్ఛాశక్తి అని అతడు గ్రహిస్తాడు. మనుషులంతా విశ్వాత్మలో భాగమని అర్థం చేసుకుంటాడు. టామ్ అతడిని కూడా తనతో తీసుకువస్తాడు.

జోడ్ కుటుంబానికి అమ్మ ఆధారం వంటిది. శక్తి వంటిది. టామ్ రాగానే ఆమెకు ఎంతో ధైర్యం వస్తుంది. అంతవరకూ ప్రయాణం వద్దన్న ఆమె, టామ్‌ని చూడగానే ప్రయాణానికి సన్నాహాలు ఆరంభిస్తుంది. అందరూ అదేదో పిక్నిక్‌కి బయలుదేరినట్టు, ఇల్లు వదలి, తప్పనిసరిగా అవసరమయ్యే వస్తువులు తీసుకుని బయలుదేరతారు. పెద్దలు భవిష్యత్ గురించి బెంగ పడుతూంటారు. పిల్లలు ఉత్సాహంగా ఉంటారు.

కాలిఫోర్నియా వెళ్లేదారి నిండా ఇలా ప్రయాణమయ్యే వారే ఉంటారు. లారీలు, కార్లు, పాత ట్రక్కులు ఇలా ఏది దొరికితే దాన్లో ప్రయాణిస్తూంటారు. దారిపక్కన పాడైపోయిన ట్రక్కులు కనిపిస్తూంటాయి. ఈ ప్రయాణాన్ని స్టెయిన్‌బెక్ వర్ణించిన విధానం అద్భుతం. దారిలో ఓ దుకాణంలో ధనవంతుల పిల్లలు ఐస్‌క్రీములు తింటూంటే రూథీ, విన్‌ఫీల్డులు వాళ్ల వైపు ఆశగా చూస్తూండటాన్ని వర్ణించిన తీరు ఎదను కలచివేస్తుంది. ప్రయాణంలోని కఠిన పరిస్థితులను తట్టుకోలేని నానమ్మ తాతయ్యలు దారిలోనే మరణిస్తారు. కొలరాడో నది చేరేసరికి వీరితో ఉంటే భవిష్యత్ లేదని భావించిన నోవా చెప్పాపెట్టకుండా వెళ్లిపోతాడు. ఇంతకాలం కష్టసుఖాలను కలిసి భరించిన కుటుంబం ఇప్పుడు విచ్ఛిన్నమవుతోందని అమ్మ బాధపడుతూంటుంది.

ఎడారి దాటి పచ్చని కాలిఫోర్నియా లోయలో అడుగు పెడతారు జోడ్ కుటుంబ సభ్యులు. కాలిఫోర్నియా వలస వచ్చిన వారి కోసం ఏర్పాటు చేసిన క్యాంపులు చూస్తూనే వణికిపోతారు. అక్కడి అశుద్ధం, దుర్గంధం, దీనావస్థలో ఉన్న గుడిసెలు చూసి అక్కడ ఉండబుద్ధి కాదు. కానీ గత్యంతరం లేక అక్కడే ఉంటారు. అప్పుడు టామ్‌కి ఓ సత్యం తెలుస్తుంది. కాలిఫోర్నియాలో ఏమీ ఉద్యోగాలు లేవని, అది తాము ఊహించినట్టు భూతల స్వర్గం కాదని. పంట కోసేందుకు మనుషుల అవసరం ఉన్నప్పుడు ఇలా కరపత్రాలు ముద్రించి పంచుతారు. వందమంది లేబర్ల అవసరం ఉన్నచోట, ప్రచారం ప్రభావంతో వేల మంది పనివారు వస్తారు. దాంతో తక్కువ జీతానికి పనిచేసేందుకు మనుషులు ఎప్పుడూ సిద్ధంగా ఉంటారు. ఇలా జరగటం వల్ల ఆశతో పట్టణం వచ్చిన అనేకులు పనిలేక తిండి లేక నేరాలకు పాల్పడుతున్నారు. అందుకని ఇలా వలస వచ్చిన వారిని ఒక స్థలంలో ఎక్కువ కాలం ఉండనివ్వరు. వారిని ఓ సంఘంలా ఏర్పడనివ్వరు. అలా ఏర్పడితే మళ్లీ హక్కుల కోసం పోరాడే అవకాశం ఉంటుంది.

పరిస్థితి గ్రహించిన టామ్ బాధపడతాడు. క్యాంపులో తాము తింటుంటే, ఇతరులంతా ఆకలిగా, కళ్లప్పగించి ఆశగా తమ వైపు చూడటం జోడ్ కుటుంబం గమనిస్తుంది. అమ్మ బాధపడుతుంది. ఈ పరిస్థితులు చూసి, వీరితో ఉంటే తనకు భవిష్యత్ లేదని గ్రహించిన షరన్ భర్త చెప్పాపెట్టకుండా పారిపోతాడు. తెల్లారే పోలీసును వెంట పెట్టుకుని ఓ మనిషి క్యాంపుకు వస్తాడు. 'టులారే కంట్రీ'లో బోలెడు ఉద్యోగాలున్నాయని చెప్తాడు. 'జీతం ఎంత?' అని అడిగిన వ్యక్తిని కమ్యూనిస్టు అని ఆరోపించి కొడతాడు. పోలీసు అతడిని తుపాకీతో కాలుస్తాడు. ఇది చూసి అతడిపై జిమ్ కేసీ తిరగబడతాడు. వెంటనే పోలీసులు జిమ్ కేసీని అరెస్టు చేస్తారు. ఆ రాత్రే క్యాంపును వదలి వెళ్లిపోమని చెప్తారు. ఎందుకంటే తెల్లారేసరికి క్యాంపు దగ్ధం అవుతుందని చెపుతారు. దాంతో మూటముల్లె సర్దుకుని జోడ్ కుటుంబం మళ్లీ ప్రయాణం ఆరంభిస్తుంది. వారికి ప్రభుత్వ క్యాంపులో స్థలం లభిస్తుంది. కానీ ఆ ప్రాంతంలో ఉద్యోగాలు లేకపోవడంతో మళ్లీ ప్రయాణం కొనసాగిస్తారు.

దారిలో వారిని ఓ వ్యక్తి కలిసి అత్తిపళ్లను తుంచే పని ఉంది రమ్మంటాడు. జోడ్ కుటుంబం వెళ్తారు. అయితే ఆ తోట చుట్టూ కంచె ఉంటుంది. కాపలాగా పోలీసులుంటారు. వీరు లోపలకు వెళ్లగానే తలుపులు వేసేస్తారు. ఎందుకంటే బయట స్ట్రైక్ జరుగుతూంటుంది. అయినా టామ్ రహస్యంగా కంచె దగ్గరకు చేరుకుంటాడు. ఆ స్ట్రయిక్‌కు నాయకుడు జిమ్ కేసీ అని గ్రహిస్తాడు టామ్. 'మీరు ఇక్కడ పనిచేయటం వల్ల కూలీ తగ్గుతుంది. మీరూ పని చేయటం మాని మాతో చేతులు కలిపితే మనకు న్యాయమైన కూలీ దొరుకుతుంద'ని టామ్‌కు వివరిస్తాడు కేసీ.

టామ్, కేసీల సంభాషణ విన్న పోలీసులు కేసీని చంపేస్తారు. ఆవేశంలో పోలీసును చంపి టామ్ ఇంటికి పారిపోయి వచ్చి జరిగింది అమ్మకు చెపుతాడు. టామ్‌ను బట్టల కింద దాచి, వారు ఆ స్థలం వదలిపెట్టేస్తారు. అటు నుంచి వారు పత్తిని కోసే పనిలో చేరతారు. అయితే టామ్ వారితో ఉన్న విషయం పోలీసులకు తెలియటంతో టామ్ వారిని వదలి పారిపోవాల్సి వస్తుంది. 'అల్' ఓ అమ్మాయిని ప్రేమించి వెళ్లిపోతాడు. ఇదే సమయానికి షరన్ ప్రసవ వేదన పడుతూంటుంది. ఆమెను డాక్టర్ దగ్గర తీసుకువెళ్లేందుకు ఎవరూ ఉండరు. దాంతో అతి కష్టం మీద దారిలోని ఓ పూరిగుడిసెలో అమ్మ, నాన్నల సహాయంతో షరన్ ప్రసవిస్తుంది. ఆ గుడిసెలో ఓ మూల ఓ ముసలాయన కొన ఊపిరితో ఉంటాడు. అతడు ఆకలితో మరణిస్తూంటాడు. అది చూసి, అప్పుడే ప్రసవించిన షరన్ పాలు ఉత్పన్నమవుతున్న తన వక్షోజాన్ని అతడికి అందిస్తుంది. అతడి ప్రాణం కాపాడుతుంది. ఇదీ 'గ్రేప్స్ ఆఫ్ రాత్' కథ.

అమెరికాలోని దుర్భర పరిస్థితులను కళ్లకు కట్టినట్టు వర్ణిస్తుందీ నవల. నవల చదువుతూంటే గుండె వేదనతో మెలితిరుగుతుంది. ఈ నవల చదివిన తరువాత వలసవారిని, కూలీలను చూస్తూంటే తెలియని బాధావీచికలు ఎదను అలుముకుంటాయి. మనం మనుషులుగానే పరిగణించక చీదరించుకుని పోయేవారూ మనుషులేనని, వారొక్కొక్కరిదీ ఓ అద్వితీయమైన జీవితం అని అనిపిస్తుంది. వారి పట్ల జాలితో, కరుణతో గుండె నిండిపోతుంది.

స్టెయిన్‌బెక్ నవలలన్నీ సినిమాలుగా వచ్చాయి. తన నవలలను నాటికలుగా కూడా రాశాడు స్టెయిన్‌బెక్. 'ఆఫ్ మైస్ అండ్ మెన్', 'మూన్ ఈజ్ డౌన్' వంటివి సినిమాలుగా, నాటకాలుగా విజయవంతమయ్యాయి. అనేక సినిమాలకు స్క్రిప్టులు కూడా రాశాడు స్టెయిన్. కానీ నవలా రచనలో స్టెయిన్‌బెక్ సృజనాత్మకత విశ్వరూపం చూడవచ్చు. సాటి మానవుడి పట్ల ఒక సృజనాత్మక రచయిత సున్నిత హృదయ స్పందనలు అతని రచనలు.

☆